# వారంటీ లేనోళ్ల.. గ్యారంటీలు నమ్ముదామా..?

- అప్పుడు అధికారంలో ఉండి చేయనోళ్లు ఇప్పుడు చేస్తరా..?
- కాంగ్రెస్‌వన్నీ బూటకపు హామీలే
- ఎమ్మెల్యే రసమయి బాలకిషన్
- ఖాసీంపేటలో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన



ఖాసీంపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

గన్నేరువరం రూరల్, అక్టోబర్ 7: 'కాంగ్రెస్ పార్టీ పనైపోయింది. ప్రజలకు ఎప్పుడో దూరమైంది. వాళ్లకు ఆదరణే లేదు. ఎన్నికలు వస్తున్నాయని అధికారం కోసం ఆచరణ సాధ్యం కాని హామీలు ఇస్తున్నరు. ఆ పార్టీకి వారంటీయే లేదు. ఇప్పుడు ఆ దొంగల ముఠా ఇచ్చే గ్యారెంటీలు నమ్ముదామా..? నేనొక్కటే అడుగుతున్నా.. అప్పుడు యాభై ఏండ్లు అధికారంలో ఉండి పనులు చేయనోళ్లు.. ఇప్పుడు చేస్తరా..? ఒకసారి ఆలోచించండి' అంటూ ఎమ్మెల్యే, సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ ప్రజలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు నోరు తెరిస్తే అన్నీ అబద్ధాలేనని, బూటకపు హామీలతో ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. శనివారం పీచుపల్లిలో రెడ్డి సంఘం భవనానికి ప్రారంభోత్సవం చేశారు. ఖాసీంపేటలో రెడ్డిసంఘం, అంబేద్కర్ సంఘం భవనాలకు భూమిపూజ చేసి, సీసీ రోడ్లు, మానసాదేవి ఆలయం వద్ద భవనాన్ని ప్రారంభించారు. గ్రామ యువకులకు కేసీఆర్ క్రీడా కిట్లను పంపిణీ చేశారు. వివిధ పార్టీల నుంచి 100 మంది నాయకులను బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ కర్ణాటక రాష్ట్రంలో ఇలాగే సాధ్యంకాని హామీలు ఇచ్చిందని, తీరా గెలిచిన తర్వాత మొండిచేయి చూపిందని మండిపడ్డారు. కవ్వంపల్లి సత్యనారాయణకు నియోజకవర్గంలో ఎన్నిగ్రామాలు ఉన్నాయో..? కూడా తెలియదని, ఎన్నికలు రాగానే ఓ టూరిస్టు లెక్క తిరుగుతున్నాడని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసమే ప్రభుత్వం పని చేస్తోందని, ప్రజలు ప్రభుత్వానికి వారధిగా ఉన్నారన్నారు. ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్న గ్రామాల్లో డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించి ఇస్తున్నామని, ఇంటి స్థలం ఉన్న వారికి గృహలక్ష్మి పథకం కింద రూ.3లక్షల సాయం చేస్తున్నదని వివరించారు. రాష్ట్రం రాక ముందు సాగునీళ్లు లేక వలస పోయిన రైతులు, కేసీఆర్ సీఎం అయ్యాక కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో పుష్కలమైన జలాలను చూసి వాపస్ వస్తున్నారన్నారు. పండుగలా వ్యవసాయం చేసుకుంటున్నారని చెప్పారు. తానొక్కటే విజ్ఞప్తి చేస్తున్నానని, కాంగ్రెస్ బూటకపు హామీలు, అసత్య ప్రచారాన్ని ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో కర్రుకాల్చి వాతపెట్టడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ రవీందర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, గూడెల్లి తిరుపతి, మోహన్ రెడ్డి, మన్మోహన్ రావు, అల్వాల కోటి, సుధాకర్ తదితరులు ఉన్నారు.

# ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీ గోపి, పక్కన సీపీ సుబ్బారాయుడు, అదనపు కలెక్టర్లు, తదితరులు

కలెక్టరేట్, అక్టోబర్ 7: రాబోయే సాధారణ ఎన్నికల కోసం కేటాయించిన విధులు సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ బీ గోపి అధికారులను ఆదేశించారు. నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం ఆయన సీపీ, ఆర్వో, నోడల్ అధికారులతో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నిర్వహించాల్సిన విధులు, వ్యవహరించాల్సిన తీరుపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎంసీసీ, సివిజిల్, ఎంసీఎంసీ విధులపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల కోడ్ ప్రారంభమై, తిరిగి ముగిసే వరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పని చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతి అంశం, ఎన్నికల మార్గనిర్దేశాలపై క్షుణ్ణంగా చదివి, అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల సమయంలో ప్రచారాలు, పెయిడ్ న్యూస్, ఖర్చులు, తదితరాలతో పాటు అభ్యర్థులు, పార్టీలపై వచ్చే ఫిర్యాదులపై సత్వరమే స్పందించాల్సి ఉంటుందన్నారు. ఆర్వో పుస్తకాన్ని చదివి ఎలాంటి సందేహాలున్నా నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఎన్నికల నివేదికలను ఏ రోజుకారోజు పంపించాలన్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. పోలీస్ కమిషనర్ ఎల్ సుబ్బారాయుడు మాట్లాడుతూ, జిల్లాలో 5 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి 24 గంటల పాటు పర్యవేక్షించాల్సి ఉంటుందన్నారు. పోలీస్ శాఖతో పాటు ఇతర శాఖల అధికారులు కూడా సమన్వయం కావాల్సి ఉంటుందన్నారు. మద్యం, నగదు అక్రమంగా తరలించకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలో డ్రగ్స్, గంజాయి సరఫరాను సమూలంగా నిర్మూలించాలన్నారు. అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, డీఎఫ్‌వో బాలమణి, డీపీవో వీరబుచ్చయ్య, సీపీవో కొమురయ్య, ఇన్‌చార్జి డీఆర్వో పవన్‌కుమార్, ఆర్డీవో మహేశ్వర్, ఏసీపీలు ప్రతాప్, కరుణాకర్‌రావు, ఇతర పోలీసు అధికారులు, నోడల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

## ఎలగందుల ఖిల్లాపై నేడు మెగా స్వచ్ఛతా హీ సేవ

కొత్తపల్లి, అక్టోబర్ 7: మండలంలోని ఎలగందుల ఖిల్లాపై జిల్లా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మెగా స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవోల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నీలగిరి దివ్యదర్శన్‌రావు, ఎడబోయిన శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, జిల్లా అధికారులతో పాటు జిల్లా నుంచి 2వేల మంది అధికారులు, సిబ్బంది పాల్గొని ఖిల్లాపై శ్రమదానం చేస్తారని తెలిపారు. ఉదయం 7 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

## రాబోయే ఎన్నికల్లో సమన్వయంతో పని చేయాలి

తెలంగాణ చౌక్, అక్టోబర్ 7: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్సైజ్, పోలీస్‌శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఎక్సైజ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, మాట్లాడారు. నాటుసారా తయారు చేసే, రవాణా చేసే ప్రాంతాలను గుర్తించాలన్నారు. నాటుసారా తయారీకి ఉపయోగించే ముడిపదార్థాలను విక్రయించే వారికి గుర్తించి తహసీల్ కార్యాలయంలో బైండోవర్ చేయాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తీసుకువచ్చే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. గంజాయి, మత్తు పదార్థాలు సేవించేవారు, రవాణా చేసేవారిపై ప్రత్యేక దృష్టిసారించి, పట్టుకోవాలన్నారు. ఇక్కడ ఎక్సైజ్ సీఐలు గులాం ముస్తఫా, గుంటేటి రాము, చంద్రశేఖర్ ఉన్నారు.

### సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సామాజిక మాధ్యమాల్లో ప్రకటనలు చూసి మోసపోవద్దని ఎస్పీ అఖిల్‌మహాజన్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. వారం రోజుల్లో జిల్లాలో జరిగిన సైబర్ నేరాల వివరాలను శనివారం ఆయన వెల్లడించారు. లోన్‌యాప్, లాటరీ, పార్ట్‌టైమ్ జాబ్, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం, పింక్ వాట్సాప్ పేరుతో మెసేజ్‌లు రాగానే ఆశపడి మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏదైనా సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే 1930, లేదా డయల్ 100నంబర్‌కి కాల్ చేయాలన్నారు.

## గంజాయి విక్రేతల అరెస్ట్

సిరిసిల్ల, అక్టోబర్ 7: సిరిసిల్లలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు సిరిసిల్ల ఎక్సైజ్ సీఐ గులామ్ ముస్తాఫా పేర్కొన్నారు. జిల్లా ఎక్సైజ్ అధికారి పంచాక్షరీ, కరీంనగర్ ఎక్సైజ్ ఉప కమిషనర్ విజయ భాస్కర్‌రెడ్డి ఆదేశాల మేరకు సిబ్బంది సిరిసిల్లలో ప్రభుత్వ దవాఖాన సమీపంలో తనఖీలు నిర్వహించినట్లు తెలిపారు. మార్కెండేయ వీధికి చెందిన ఎండీ నయీం, చింతకుంట సంతోష్ నాందేడ్ నుంచి తీసుకొచ్చి విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 36 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇద్దరిని అరెస్ట్ చేసి కరీంనగర్ జైలు కు తరలించామన్నారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ శైల జ, ఎక్సైజ్ ఎస్ఐలు శేఖర్, రాజేందర్ సిబ్బం ది ఏ శ్రీనివాస్, జీ శ్రీనివాస్ ఉన్నారు.

## డీఎస్సీ, ఎస్జీటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

కమాన్ చౌరస్తా, అక్టోబర్ 7 : తెలంగాణ వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర బీసీ స్టడీ సర్కిల్ ద్వారా డీఎస్సీ, ఎస్జీటీ టీచర్ ఉద్యోగాల అభ్యర్థులకు ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ కరీంనగర్ డైరెక్టర్ రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలకు చెందిన నిరుద్యోగ అభ్యర్థులను మెరిట్ ప్రాతిపదికన ఎంపిక చేస్తామన్నారు. తల్లిదండ్రుల సంవత్సర ఆదాయం ₹5 లక్షలలోపు ఉండాలని, అభ్యర్థులు సర్టిఫికెట్లు, ఆధార్‌తో ఈ నెల 12వ తేదీలోగా కరీంనగర్ డ్యాం సమీపంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 0878-2268686, బీసీ స్టడీ సర్కిల్‌లో సంప్రదించాలని తెలిపారు.

## గ్రామాల్లో సకల వసతులు: ఆగయ్య



దేవునిగుట్టతండాలో జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 7: తండాల్లో సకల వసతులు కల్పించి ఆత్మగౌరవ తండాలుగా మార్చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. శనివారం ఆయన దేవునిగుట్ట నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ఎంపీపీ పిల్లి రేణుక, జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏఎంసీ చైర్మన్ ఎలుసాని మోహన్‌కుమార్‌ను గ్రామ పంచాయతీ పాలక వర్గ సభ్యులు సన్మానించారు. ఇక్కడ పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సర్పంచులు గుగులోత్ పెంటయ్య, అజ్మీరా రజిత, ఉప సర్పంచ్ ప్రకాశ్‌నాయక్, నాయకులు కళ్యాణ్, బుగ్గ కృష్ణమూర్తి, నాజీం, అందె సుభాష్, రాగం ఎల్లయ్య, కొండ ఆంజనేయులుగౌడ్, తదితరులు ఉన్నారు.

## జిల్లెల్ల ఎక్స్‌రోడ్ - ఇల్లంతకుంట రోడ్డుకు మహర్దశ

సిరిసిల్ల రూరల్, అక్టోబర్ 7: తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల ఎక్స్‌రోడ్ నుంచి ఇల్లంతకుంట రోడ్డుకు మహర్దశ పట్టనున్నది. ఈ రోడ్డును రెండు వరుసల రహదారి మార్చేందుకు ప్రభుత్వం రూ.13కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు కావడంతో తంగళ్లపల్లి, ఇల్లంతకుంట మండలాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు ఎంపీపీ పడిగెల మానస, జడ్పీటీసీ పుర్మాణి మంజుల, ఏఎంసీ చైర్‌పర్సన్ పూసపల్లి సరస్వతి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మాట్ల మధు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు చెన్నమనేని వెంకట్రావు, సింగిల్‌విండో చైర్మన్ కోడూరి భాస్కర్‌గౌడ్, ఆర్‌బీఎస్ మండలాధ్యక్షుడు కొమ్మెటి రాజిరెడ్డి, సర్పంచులు స్రవంతి భాస్కర్‌రెడ్డి, మాసిరెడ్డి అవినాష్‌రెడ్డి, ఎంపీటీసీ రాములు కృతజ్ఞతలు తెలిపారు.

## నాణ్యమైన విద్యనందించాలి: డీఈవో



పాఠశాలలో విద్యార్థినితో మాట్లాడుతున్న డీఈవో రమేశ్‌కుమార్

ఇల్లంతకుంట, అక్టోబర్ 7: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం ఆయన పెద్దలింగాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించి, మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. ప్రతి విద్యార్థి వంద శాతం మార్కులు సాధించేలా ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బోయిని తిరుపతి, శైలజ, కొమ్ము రమేశ్ ఉన్నారు.

## గృహలక్ష్మి ప్రొసీడింగ్స్ అందజేత

సిరిసిల్ల రూరల్, అక్టోబర్7: తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీ జీపీ ఆవరణలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు, గృహలక్ష్మి ప్రొసీడింగ్స్, బతుకమ్మ చీరలను సర్పంచ్ బైరి శ్రీవాణి శనివారం అందజేశారు. ఇక్కడ ఎంపీటీసీ సిలువేరి ప్రసూన, ఏఎంసీ డైరెక్టర్ బైరి రమేశ్, ఉప సర్పంచ్ అలువాల సాయిరాం, బొద్దుల రాజేశ్, కార్యదర్శి సలీం, అంగన్‌వాడీ కార్యకర్త శ్రావణి, సీఏ కళ్యాణి, సెస్ ప్రతినిధి రూప, గ్రామశాఖ అధ్యక్షుడు మహేశ్, మండల బీసీ సెల్ ఉపాధ్యక్షుడు సాదుల భాస్కర్, సీనియర్ నాయకుడు వేముల శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.